సంపుటి : 04 | సంచిక : 173
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
ఏప్రిల్ 07, 2025
వరంగల్ వాయిస్
Evening Daily
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


8లో..

## సరస్వతీ పుష్కరాలకు ఏర్పాట్లు ముమ్మరం

- మే 4 వరకు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ






# అల్లుడూ.. గిల్లుడు

- గోదావరినీ తోడేస్తున్నారు
- అడ్డూ, అదుపూ లేకుండా ఇసుక దందా
- కాళేశ్వర, ముక్తేశ్వర స్వామి సాక్షిగా దోపిడీ
- జేసీబీతో లోడింగ్.. నాలుగు ప్రాంతాల్లో డంపింగ్
- అక్కడినుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి

వాగైనా.. వంకైనా.. చెరువైనా.. గోదావరి నదైనా.. ఇసుక దొరకాలేకానీ దోచెయ్యడమే తరువాయి అన్న చందంగా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం పరిసరాల్లో గోదావరి నది ఇసుకనూ యథేచ్ఛగా తోడేస్తున్నారు. కాళేశ్వర, ముక్తేశ్వర స్వామి సాక్షిగా దోపిడీ మూడు టిప్పర్లు..ఆరు ట్రాక్టర్లు అన్న చందంగా సాగుతోంది. మే 15 నుంచి కాళేశ్వరంలో ప్రారంభం కానున్న సరస్వతి పుష్కరాల పనులకు ఇసుకను తోడుతున్నట్లు కలరింగ్ ఇస్తూ చీకటి వ్యాపారానికి తెరలేపారు. కాళేశ్వరం అల్లుడిగా చెప్పుకునే బడా కాంట్రాక్టర్ కనుసన్నల్లోనే ఎలాంటి అనుమతులు లేకుండా జేసీబీ సాయంతో వందల ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. ఈ ఇసుకను నాలుగు చోట్ల పెద్ద ఎతున్న డంపింగ్ చేసి అక్కడినుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతున్నా ఇక్కడి అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అయితే వారి మామూళ్లు వారికి ముడుతున్నందునే అధికారులు స్పందించడంలేదన్న ప్రచారం సాగుతోంది.

–వరంగల్ వాయిస్, మహదేవపూర్


8లో..

## పంచాయతీ కార్యదర్శుల బదిలీలు ఆపండి

- ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి
- టీఎన్జీవోస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్
- గ్రీవెన్స్ లో కలెక్టర్ కు వినతి

## సమగ్ర సమాచారంతో డైరీ రూపకల్పన

- నగర మేయర్ గుండు సుధారాణి
- జేపీసీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


2లో..



7లో..

## సంఘటితంగా అభివృద్ధి

- ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ సుధారాణి
- చింతగట్టులో పద్మశాలి భవనానికి శంకుస్థాపన
- వారి అభ్యున్నతికి కృషి చేస్తామంటూ హామీ

# సమగ్ర సమాచారంతో డైరీ రూపకల్పన

- నగర మేయర్ గుండు సుధారాణి
- జేఏసీ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమగ్ర సమాచారంతో డైరీ రూపకల్పన చేయడం అబినందనీయమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం బల్దియా జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసి) ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి మేయర్ ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. అనంతరం జేఏసీ కోశాధికారి స్వర్జన్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ డైరీ రూపకల్పన చాలా శ్రమతో పాటు వ్యయ ప్రయాసలతో కూడుకున్నదన్నారు. గత 15 సంవత్సరాలుగా జేఏసీ ఆధ్వర్యంలో డైరీని రూపొందించడం హర్షణీయం అన్నారు. ముఖ్యం గా ఉద్యోగులు సిబ్బంది రోజు వారి చేయాల్సిన విధులను నమోదు చేసుకొని అమలు చేయడానికి దైనందిని (డైరీ) ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో జేఏసీ ముందు వరసలో ఉంటూ సహకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు బోట్ల రమేష్, గౌరవ అధ్యక్షులు ధర్మ రాజు, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్, కోశాధికారి స్వర్జన్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు భాస్కర్, కార్యదర్శి బాలు నాయక్, ఉపాధ్యక్షులు రావుల ఆనంద్ తో పాటు ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, డీఎఫ్ఓ శంకర్ లింగం, సెక్రటరీ అలివేలు, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, హెచ్ ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## 57వ డివిజన్ లో పర్యటన..

బల్దియా పరిధి 57వ డివిజన్ సమ్మయ్య నగర్ లో సోమవారం నగర మేయర్ గుండు సుధారాణి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేలు క్షేత్ర స్థాయిలో పర్యటించి స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈ రవి కుమార్, డీఈ సారంగం, ఏఈ మేనక తదితరులు పాల్గొన్నారు.



# జన జీవన స్రవంతిలో కలవండి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్
- మహిళా మావోయిస్టుకి రివార్డ్ అందజేత

**వరంగల్ వాయిస్, క్రైం :** మావోయిస్టులు అజ్ఞాతం వీడి జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితం గడపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 21న వరంగల్ పోలీస్ కమిషనర్ ఎదుట లొంగిపోయిన నిషేధిత మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యురాలు వంజం కేశే అలియాస్ జెన్నీకి ఆమెపై ప్రభుత్వం ప్రకటించిన రూ.4 లక్షల రివార్డును సీపీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అడవి బాట పట్టిన మావోయిస్టులు హింసను వదిలి జనం మధ్యలోకి రావాలన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను అందుకొని కుటుంబాలతో ప్రశాంతంగా జీవనం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, ఏసీపీలు జితేందర్ రెడ్డి, తిరుమల్, కాజీపేట్ ఇన్స్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం

- భవిష్యత్‌లో సేవలు విస్తృతం చేయాలి
- సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా
- వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, పెద్దవంగర :** సమాజ సేవ, నాయకత్వం, సంక్షేమ కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ అంకితమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. పెద్దవంగర మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న లయన్స్ క్లబ్ కమ్యూనిటీ భవన భూమిపూజ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథి హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సామాజిక సేవే లయన్స్ క్లబ్ లక్ష్యం అన్నారు. లయన్స్ క్లబ్ వారి సేవలు నిస్వార్ధమైనవని పేర్కొన్నారు. 1996 నుంచి లయన్ క్లబ్ పైన తనకు అవగహన ఉందన్నారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు విస్తృతం చేయాలనే సదుద్దేశంతో పెద్ద వంగరలో భూమి పూజ చేసుకోవడం హర్షనీయమన్నారు. లయన్స్ క్లబ్ కొరకు వరంగల్ లేదా తొర్రూర్ కి వెళ్లడం సాధ్యం కాని వారికి ఇప్పుడు పెద్ద వంగరలోనే లైయన్స్ క్లబ్ అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు లయన్స్ క్లబ్ ఎల్లవేళలా కృషి చేస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. ఉచిత కంటి పరీక్షలతో పాటు ప్రయాణ ఖర్చులు అందించడం హర్షనీయం అన్నారు. ప్రస్తుత కాలంలో విద్య, వైద్యం ఎంతో ఖర్చుతో కూడుకున్నదని ఎంపీ పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా తన వంతు సహకారం అందిస్తానని ఎంపీ డా.కడియం కావ్య స్పష్టం చేశారు. తన ఎంపీ నిధుల నుంచి లైన్స్ క్లబ్ అభివృద్ధికి రూ.5 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకట్ రెడ్డి, పూర్వపు జిల్లా గవర్నర్ లు రాజేందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, జోన్ చైర్మన్ శ్రీదేవి, లైన్స్ క్లబ్ అధ్యక్షులు ఎదునూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రేణుక, మాజీ కార్పొరేటర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.







# 14 మంది మందు బాబులకు జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రై సిటీ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంక్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుపడిన 14 మంది వాహనదారులకు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. మరో ఇద్దరికీ సామాజిక సేవ చేయాల్సింది న్యాయమూర్తి ఆదేశించారు. అలాగే మరో 75 మంది వాహనదారులు న్యాయమూర్తి జరిమానా విధించారని ట్రాఫిక్ ఏసీపీ సత్య నారాయణ వెల్లడించారు. మద్యం సేవించి వాహనము నడపటం నేరమని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కితే జైలు జీవితం తప్పదని ఏసీపీ హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి...

**అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్**

**వరంగల్ వాయిస్, జనగామ :** ధాన్యం రాకను బట్టి అదనపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తాసిల్దార్లను ఆదేశించారు. సోమవారం రబి సీజన్ ను పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసేలా రెవెన్యూ, వ్యవసాయ శాఖ, సివిల్ సప్లై అధికారులు పర్యవేక్షణ చేస్తూ సిబ్బందికి సలహాలు, సూచనలు ఇవ్వా లన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్లు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రాలకు కావలసిన సామాగ్రిని సమకూర్చాలన్నారు. సంబంధిత అధికారులు కేంద్రాల ఏర్పాటుకు నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ గోపిరామ్, వ్యవసాయ శాఖ అధికారి రామారావు నాయక్, సహకార శాఖ అధికారి రాజేందర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల అధికారి సరస్వతి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ హథిరాం, అధికారులు పాల్గొన్నారు.



# ఐజేయూతోనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం

■ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నేతలు

**వరంగల్ వాయిస్, పరకాల :** ఐజేయూ అనుబంధ టీయూడబ్ల్యూజేతోనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారం సాధ్యమని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అద్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు అన్నారు. పరకాల పట్టణంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ముందుండి పోరాటం సాగిస్తున్న సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయూ)మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు,హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు సాధించి పెట్టిన ఘనత ఈ సంఘానికే ఉందన్నారు. రానున్న రోజుల్లో వరంగల్ నగరంతో సహా మండల కేంద్రాలలో జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు, ఇండ్లు సాధించేందుకు పోరాడుతామన్నారు. రాష్ట్రంలో వివిధ కారణాలతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునేందుకు కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో కూడా జర్నలిస్టుల సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ సమస్యల సాధనకై జర్నలిస్టులకు అండగా టీయూడబ్ల్యూజే నిలుస్తుందని, అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు,హెల్త్ కార్డుల జారీ, ఇతర సమస్యలను



ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి అమలు పరిచేలా కృషి చేస్తామని చెప్పారు. ఆరు దశాబ్దాల చరిత్ర ఉన్న యూనియన్ పై జర్నలిస్టులకు ఎంతో విశ్వాసం ఉందని, ప్రతి జర్నలిస్టు ఐజేయూలో సభ్యత్వం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పురుషోత్తం, జిల్లా సహాయ కార్యదర్శి గన్ను సంతోష్, కార్యవర్గ సభ్యులు గడ్డం బాలరాజు, అల్లె రామారావు, ముదిగిరి ఓదెలు, తాళ్ల రవి, నాయకులు బొజ శ్రీనివాస్ రెడ్డి, కత్తి రాజు. గూడెల్లి కార్తీక్, మోరే రమేష్ బాబు, అంకేశ్వరపు ఐలయ్య, బొజ్జం చొక్కా రావు, రవీందర్, జి .రాజు, నారగాని రమేష్, రాజేందర్, భాస్కర్, పాషా, రాజా చారి శివ కుమార్, శాయంపేట, ఆత్మకూరు మండలాల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.పాల్గొన్నారు.

# కేఎంసీ మెస్ వర్కర్లకు జీతాలు వెంటనే ఇవ్వాలి



▪ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జిల్లపల్లి సుధాకర్

**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాకతీయ వైద్య కళాశాల మెన్స్, ఉమెన్స్ హాస్టల్‌లలో పనిచేస్తున్న 86 మంది కార్మికులు గత 9 నెలలుగా వేతనాలు పొందకుండా తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులైన డీఎంఈ (DME)నిర్లక్ష్యమే కారణమని తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి జిల్లపల్లి సుధాకర్ విమర్శించారు. వేతనాల్లేని పరిస్థితిలో ఉండలేని స్థితికి చేరుకున్న కార్మికులు నేటి నుంచి సమ్మె ప్రారంభించారు. ఇదే అంశంపై గతంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా ఫిబ్రవరి 19న డీఎంఈ అధికారిని ఫోన్ చేసి తక్షణమే వేతనాలు చెల్లించాలని ఆదేశించినా, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా మంత్రి ఆదేశాలను కూడా లెక్కచేయకపోవడం బాధాకరమని ఆయన తెలిపారు. ఇక, సమ్మె శిబిరాన్ని సందర్శించిన హనుమకొండ జిల్లా కలెక్టర్ కూడా కార్మికులకు రావలసిన వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చి నెల రోజులు గడిచినా ఇప్పటికీ వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర నిరాశలో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 9 నెలల పెండింగ్ వేతనాలను విడుదల చేసి, కార్మికులకు న్యాయం చేయాలని జిల్లపల్లి సుధాకర్ డిమాండ్ చేశారు. కాకతీయ వైద్య కళాశాల హాస్టల్ కార్మికులు తమ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతున్నారు.

# ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి

▪ అభిశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ఆవుల వెంకటేశ్వర్లు

**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** వికలాంగులకు, దివ్యాంగులకు, నిరుపేద విద్యార్థులకు, వితంతులకు ఆదుకోవడానికి, నిరుద్యోగులకు యువతకు అవకాశాల కల్పించడం కోసం వారికి అండగా ఉండడానికి గొప్ప లక్ష్యంతో అభిశ్రీ అభి శ్రీ ఫౌండేషన్ ఏర్పాటు చేశామని ఫౌండర్ చైర్మన్ ఆవుల వేంకటేశ్వర్లు అన్నారు. జమ్మికుంట పట్టణంలోని హెచ్ పీ పెట్రోల్ పంపు సమీపంలో బ్రాంచ్ కార్యాలయాన్ని సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అభి శ్రీ ఫౌండేషన్ చైర్మన్ ఆవుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఫౌండేషన్ ఏర్పాటు చేసినప్పటి నుంచి సుమారు 4 వేల మంది వికలాంగులకు, దివ్యాంగులకు ఉచిత భోజనం, వసతి కల్పించి విద్యతో పాటు కంప్యూటర్ శిక్షణ నేర్పించి ఎందరికో ఉద్యోగ అవకాశాల



కల్పించి సమాజంలో గౌరవంగా తలఎత్తుకొని తిరిగేలా తయారు చేశామన్నారు. అనంతరం అర్హులైన టీం లీడర్స్ నీ శాలువాలతో ఘనంగా సత్కరించి మేమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీమ్ లీడర్ పాషా, కో – ఆర్డినేటర్ బైరీ సత్యం, డీకొండ రాజేందర్, మిరియాల్కార్ బాలాజి, ప్రభు పాటు సుమారు 50 మంది టీమ్ లీడర్స్ పాల్గొన్నారు.

# జార్జిరెడ్డి వర్ధంతి సభలను జయప్రదం చేయండి




➲ పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు

**వరంగల్ వాయిస్, కేయూ :** ప్రగతిశీల విద్యార్థి ఉద్యమ నేత, పీడీఎస్ యూ వ్యవస్థాపకులు, ఉస్మానియా అరణతార కామ్రేడ్ జార్జిరెడ్డి 53వ వర్ధంతి సభలను నేటి నుంచి 14 వరకు అన్ని విద్యాసంస్థల్లో విస్తృతంగా జరపాలని పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు పిలుపునిచ్చారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ముందు పీడీఎస్ యూ. రాష్ట్ర కమిటీ ముద్రించిన కామ్రేడ్ జార్జిరెడ్డి 53 వర్ధంతి వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.నరసింహారావు మాట్లాడుతూ కామ్రేడ్ జార్జి రెడ్డి జీనా హై తో మర్ నా సీఖో, కదం కదం ఫర్ లడ్ నా సీఖో అనే రణ నినాదాన్ని విద్యార్థి లోకానికి అందించి విద్యార్థుల్లో చైతన్య జ్వాలలు రగిలించాడని గుర్తు చేశాడు. విద్యార్థుల హక్కులు, శాస్త్రీయ విద్యాసాధన, సమానత్వ సమాజ స్థాపనే ధ్యేయంగా తుదికంట పోరాడాడని తెలిపారు. కామ్రేడ్ జార్జిరెడ్డి విద్యార్థుల్లో ప్రగతిశీల భావాలు పెంపొందిస్తూ 1972 ఏప్రిల్ 14న ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్, ఏబీవీపీ లాంటి మతోన్మాద శక్తుల విచ్చు కత్తుల భౌతిక దాడికి, గుండెలెదురొడ్డి పోరాడుతూ వీరమరణం పొందాడని గుర్తు చేశారు. నేడు కేంద్ర ప్రభుత్వం పాఠ్య పుస్తకాల్లో ప్రవేశపెడుతున్న ఆశాస్త్రీయ, మూఢత్వ, మతోన్మాద భావజాలాన్ని అడ్డుకునేందుకు విద్యార్థులంతా జార్జిరెడ్డి స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ గ్రేటర్ వరంగల్ కార్యదర్శి వినయ్, కాకతీయ యూనివర్సిటీ ప్రధాన కార్యదర్శి వి.కావ్య, ఉపాధ్యక్షులు పి.అనూష, గణేష్, సహాయ కార్యదర్శులు చందన, యాదగిరి, కోశాధికారి సంగీత, నాయకులు శ్రీజ,పెరియార్, హరికృష్ణ, మనోజ్, రమ్య , వినీల, నవ్య పాల్గొన్నారు.

# రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వరంగల్ వాయిస్, గణపురం :** 11కేవీ చెల్పూర్ ఏజీఎల్, టౌన్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతున్నందునరేపు ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంటల వరకు విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని గణపురం ఏఈ కె వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ అంతరాయానికి దృష్టిలో పెట్టుకొని తమ పనులు చేసుకోవాలని పేర్కొన్నారు.

# రామాలయంలో రెండవ రోజు బలిహరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో వెలసిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రెండవ రోజు బలిహరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఉదయం జరిగిన నిత్యార్చనలు, హౌమాలు, వీధి ఉత్సవం అనంతరం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా బలిహరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రాదుల నుంచి అష్టదిక్పాలకుల వరకు తృప్తిచెందేలా మంత్రోచ్చారణ, గద్యపాఠనం, రాగ తాళాల నాదం నడుమ ఆయా దిశలలో ఉండే దేవతలకు బలులు సమర్పించారు. లోకానికి ఉపద్రవాలు రాకుండా, అతివృష్టి – అనావృష్టి వంటి ప్రకృతి విపత్తులు దూరంగా ఉండాలన్న శ్రేయోభిలాషతో ఈ కార్యాచరణను నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేద పండితుడు బ్రహ్మశ్రీ వెల్లిదే భార్గవ్ శర్మ గద్య తాళములతో ఈ కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా, హృద్యంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ స్థలదాతలు వద్దిరాజు శ్యాంసుందరరావు, లక్ష్మీకాంతరావు ఫౌండ్రీ ట్రస్ట్ చైర్మన్ పులిగిల్ల వెంకట రామ నరసింహ శాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల శ్రీధర్ ఆచార్యులు, ఈవో వెంకట్రావు, 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన పూర్ణచందర్, కేడల జనార్ధన్, పద్మ మంతిని, సునీత తదితరులు పాల్గొన్నారు.అలాగే శ్రీరామ భజన మండలి సభ్యులు, కురుమకుల కరసేవకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ పవిత్ర కార్యక్రమాన్ని దర్శించుకున్నారు.

# ఇల్లంతకుంటలో వైభవంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**వరంగల్ వాయిస్, ఇల్లంతకుంట:** అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ పుణ్య కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ముక్కులు చెల్లించుకున్నారు. ఈ మహోత్సవానికి తెలంగాణ ప్రభుత్వం తరపున కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం, హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం తదితరులు హాజరై తలంబ్రాలు సమర్పించి కళ్యాణంలో పాల్గొన్నారు. జాతరకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శ్రద్ధతో ఏర్పాట్లు చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం నేతృత్వంలో హుజురాబాద్ ఏసీపీ సీహెచ్ శ్రీనివాస్, జమ్మికుంట పట్టణ సీఐ వరగంటి రవి, రూరల్ సీఐ కోరే కిషోర్, హుజురాబాద్ పట్టణ సీఐ గుర్రం తిరుమలగౌడ్, రూరల్ సీఐ పులి వెంకట్ గౌడ్, ఎస్ఐ యూనస్ హైమద్ అలీ, డిస్ట్రిక్ గార్డ్, స్పెషల్ పార్టీ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు, ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ ఇగ్గే రామారావు, కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి– రవీందర్, కాంగ్రెస్ పార్టీ ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, జమ్మికుంట పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక, శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు అంబాల రాజు, వానరాశి జాన్, మాసాడి కిషన్ రావు, మహమ్మద్ సందాని, రాచపల్లి జగన్, కనుమల్ల సంపత్, చెరుకు సంపత్, విష్ణు దాసు, వంశీధర్ రావు, నాంపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ మజ్జిగ కవ్వం అందజేత



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలివేంద్రంలో సోమవారం గుండేటి కృష్ణమూర్తి–విజయలక్ష్మి దంపతుల తరుపున వారి అబ్బాయి గుండేటి హేమంత్ కుమార్ మజ్జిగ పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారికి శాలువాతో కమిటీ సభ్యులందరూ సత్కరించారు. అలాగే, క్యాతం రవీందర్ మజ్జిగకు చిలికేందకు ఎలక్ట్రిక్ మజ్జిగ కవ్వం మెషిన్ ను సంఘానికి బహూకరించారు. వారికి కూడా శాలువాతో కమిటీ సభ్యులందరూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వంగరి రాంప్రసాద్, కోశాధికారి దుస్సా కృష్ణ, ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, దాసి శివకృష్ణ, మండల చంద్రశేఖర్, క్యాతం శ్రీనివాస్, గాజుల రాజేష్, క్యాతం రవీందర్, వంగ ఐలయ్య, కూరపాటి సతీష్ కుమార్, కోట నగేష్, ఆడెపు పాపయ్య, క్యాతం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం కుట్రలను తిప్పి కొట్టాలి

## కాంగ్రెస్ నేత దూదిపాల బుచ్చిరెడ్డి



**వరంగల్ వాయిస్, శాయంపేట :** కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తుందని రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు మండలంలోని కాట్రపల్లి సాధన పల్లి, రాజు పల్లి గ్రామాలలో కాంగ్రెస్ నాయకులతో కలిసి జై బాపు–జై భీమ్–జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ గతంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు రాజ్యాంగాన్ని అనుసరించి అన్ని రంగాల్లో రిజర్వేషన్ల ప్రకారం బడుగు బలహీనర్గాలకు సంక్షేమ ఫలాలు, అవకాశాలు అందించారని గుర్తు చేశారు. ప్రస్తుతం బీ జే పీ ప్రభుత్వం 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని చెప్పి, క్రమంగా రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆ కుట్రను తిప్పి కొట్టి రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లా చక్రపాణి, పోలపల్లి శ్రీనివాస్ రెడ్డి, మారెపల్లి రవీందర్, కృష్ణమూర్తి, చిందం రవి, వైనాల కుమారస్వామి, జగన్, సతీష్, భాస్కర్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తులకు మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, ఇల్లంతకుంట :** అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లంతకుంట శ్రీ సీతారామచంద్ర స్వాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా శ్రీ సీతారాముల కల్యాణ్యానికి వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడిదల ప్రణవ్ బాబుతో కలిసి జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి–రవీందర్, ఇల్లంతకుంట దేవస్థానం చైర్మన్ ఇంగ్లీ రామారావు, ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పెద్ది కుమార్, ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, జమ్మికుంట పట్టణ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, వావిలాల కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వానరాశి జాన్, మహమ్మద్ సందాని, మాసాడి కిషన్ రావు, చెరుకు సంపత్, కనుమల్ల సంపత్, మహమ్మద్ సజ్జద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# కోతి ఎల్లయ్య సేవలు విశిష్టమైనవి

- అధ్యాపక వృత్తికి వన్నెతెచ్చిన వ్యక్తి
- ఆయన జీవన విధానం ఆదర్శప్రాయం



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** మూడు దశాబ్దాలు ఉత్తమ సేవలు అందించిన గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు కోతి ఎల్లయ అధ్యాపక వృత్తికి వన్నెతెచ్చాడని హసన్ పర్తి బాలికల ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఇన్నంశెట్టి సుమాదేవి అన్నారు. ఆయన జీవన విధానం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా వివిధ ప్రాంతాల్లో 30 ఏళ్లు పనిచేసి హసన్ పర్తి బాలికల హైస్కూల్లో ఉద్యోగ విరమణ పొందిన కోతి ఎల్లయ్యకు సోమవారం అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమాదేవి మాట్లాడుతూ సమయపాలన పాటించడంతో పాటు విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దడంలో ఆయన ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. స్థానిక కార్పొరేటర్ జి.శివకుమార్, చిన్ననాటి మిత్రుడు సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ స్వయంకృషితో పైకి ఎదిగిన ఎల్లయ్య సేవలను కొనియాడారు. అన్నారం షరీఫ్ పెద్ద తండా, ఉర్సు, ఐనవోలు, హసన్ పర్తి పాఠశాలలో ఆయన అందించిన సేవలను గుర్తు చేశారు. జీవితం అమూల్యమైనది. ఎవరికైనా ఒక్కసారే దొరుకుతుంది. ఆ జీవితాన్ని అందంగా మలుచుకోవాలి. అర్థవంతంగా గడపాలని పొడిశెట్టి శ్రీదేవి, గోపగాని రాజన్న, విజయలక్ష్మి, రామన్న, విజయ తదితరులు అన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు ఎల్లయ్య, స్వరూప రాణి దంపతులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. సన్మాన పత్రాలను చదివి వినిపించడమే కాక ఫొటో చిత్రపటాలను అందించారు. బంధుమిత్రులంతా ఘనంగా శాలువాలతో సత్కరించారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, చిన్ననాటి మిత్రులు బాచిపల్లి చొక్కారావు, కళ్యాణి, ముత్యాల కుమారస్వామి, పద్మ రాజన్, రజిత, అరుణ్ తేజ, శీలం పార్థసారథి, రాము, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో విద్యార్థుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉపాధ్యాయులు బ్యాండ్ మేళాతో వేదికపైకి కోతి ఎల్లయ్యను తీసుకువచ్చి పూలమాలలతో సత్కరించారు.





# ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**వరంగల్ వాయిస్, జనగామ :** కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ డే సందర్భంగా సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి సంబంధించి పలు దరఖాస్తులను సమర్పించారు. బచ్చన్నపేట మండలంలోని కొన్నె గ్రామ పరిధిలో రామచంద్రగూడెం గ్రామ రైతులు దశాబ్దకాలంగా సుమారు 60 ఎకరాల్లో నీలగిరి చెట్ల సాగు చేస్తున్నారు. అయితే, ఈ చెట్ల కారణంగా సమీపంలోని చిన్న, సన్నకారు రైతుల బోర్లల్లో నీరు ఇంకిపోవడం వల్ల సాగు దెబ్బతింటోందని పేర్కొంటూ, ఆ చెట్లను తొలగించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. దేవరుప్పుల మండలం నుంచి వచ్చిన గోలి సోమిరెడ్డి తన వారసత్వ భూములకు సంబంధించి సర్వే నంబర్లను సరిచేయాలని అభ్యర్థించారు. లింగాల గణపురం మండలంలోని నేలపోగుల రెవెన్యూ పరిధిలోని సర్వే నం. 435/4 లో ఉన్న 20 కుంటల భూమి, ఇంటిని తల్లి భూలక్ష్మి తన అక్క స్వరూపకు పట్టా చేసినట్టు పసునూరి సమ్మయ్య పేర్కొంటూ, తనకు వారసత్వ హక్కు కింద ఆ భూమిని కేటాయించాలని కోరారు. రఘునాథపల్లి మండల కుర్చపల్లి గ్రామానికి చెందిన వారాల వెంకట నారాయణ, తన తండ్రి యాదగిరి పేరిట సర్వే నం. 56/బి/1 లో ఉన్న ఒక ఎకరం 22 కుంటల భూమికి 2000 సంవత్సరంలో పట్టా మంజూరై ధరణిలో నమోదు అయినప్పటికీ, ఇప్పుడు దానిని అసైన్డ్ భూమిగా పేర్కొనడం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొంటూ, రికార్డులలో మార్పులు చేయాలని కోరారు. లింగాల గణపురం మండల సిరిపురం గ్రామానికి చెందిన బొడిగ లక్ష్మయ్య, తన భూమి (సర్వే నం. 230/82) పై హైటెన్షన్ లైన్ నిర్మాణం జరుగుతోందని, అయితే పరిహారం విషయంలో అధికారులు జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ, పాస్‌బుక్‌ను పరిశీలించి తగిన న్యాయం చేయాలని కోరారు. మొత్తం 43 దరఖాస్తులను అధికారులు స్వీకరించి, ఆయా సంబంధిత శాఖలకు పంపించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలంటూ అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరామ్, డిప్యూటీ కలెక్టర్లు సుహాసిని, హనుమంత నాయక్‌లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ సీతారాములకు పట్టువస్త్రాలు

- బైరి కుటుంబం వారే అందించే ఆనవాయితీ
- కొనసాగిస్తున్న వారసులు

**వరంగల్ వాయిస్, కమలాపూర్:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఉన్న శతాబ్దాల చరిత్ర కలిగిన సీతారామచంద్రస్వామి దేవాలయం విశేష ప్రాసస్యాన్ని కలిగిఉంది. ఈ ఆలయంలో ప్రతి ఏడూ నిర్వహించే శ్రీరామనవమి కళ్యాణోత్సవాల్లో ప్రత్యేక స్థానం కలిగిన వారు కమలాపూర్‌లోని పద్మశాలి వర్గానికి చెందిన బైరి కుటుంబం. ఈ కుటుంబం తరతరాలుగా ఒక గొప్ప సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కళ్యాణోత్సవాలకు సీతమ్మకు పట్టుచీర, రామలక్ష్మణులకు బట్టలు సమర్పిస్తున్నారు. ఉత్సవ సమయంలో, రామయ్యను ఊరేగింపుగా చిన్న రథంలో చావడి వద్దకు తీసుకువచ్చి, అక్కడి నుంచి సీతమ్మను గుడిలో నుంచి డప్పు చప్పుల నడుమ ఊరేగింపుగా తీసుకువస్తారు. తర్వాత, బైరి కుటుంబం వారి ఇంటి నుంచి సంప్రదాయబద్ధంగా డప్పు చప్పుల నడుమ సీతమ్మకు పట్టుచీర, రామలక్ష్మణులకు పంచలు, ముత్యాల తలంబ్రాలు, పూలు, బుక్కా గులాలు, మంగళహారతులతో ఆలయానికి తీసుకువచ్చి సమర్పిస్తారు. ఇవన్నీ సమర్పించిన అనంతరం మాత్రమే సీతారాముల కళ్యాణోత్సవం ప్రారంభమవుతుంది. ఈ పవిత్ర సంప్రదాయాన్ని మొదట బైరి నరసయ్య మగ్గం మీద పట్టు వస్త్రాలు నేసి రామయ్యకు సమర్పిస్తూ ప్రారంభించారు. ఆయన తర్వాత ఆయన కుమారుడు బైరి కిష్టయ్య, అనంతరం కిష్టయ్య కుమారుడు బైరి రాజేందర్ కుటుంబం ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ఇలా పద్మశాలి వర్గానికి చెందిన బైరి కుటుంబం తరతరాలుగా సీతారాముల కళ్యాణోత్సవాల్లో కీలక భాగస్వాములుగా నిలుస్తూ, ఆధ్యాత్మిక వారసత్వాన్ని గౌరవప్రదంగా ముందుకు తీసుకువస్తున్నారు.



# బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

**▪ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



**వరంగల్ వాయిస్, పరకాల:** ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పరకాల పట్టణ బీఆర్ఎస్ నాయకులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రజతోత్సవ సభ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది పలుకుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అన్ని అసత్యమైనవిగా బయటపడ్డాయని, ప్రజలు కూడా ఈ మోసాన్ని గుర్తించి ఆ పార్టీపై విశ్వాసం కోల్పోయారని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలకు భయపడి కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థ ఎన్నికలు జరపలేకపోతోందని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రజతోత్సవ సభకు పరకాల నియోజకవర్గం నుంచి 25 వేల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరయ్యేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ స్థాయి నేతలతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి వార్డు వారిగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ నాయకులు ఓర్పుగా ఉండాలని, భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీవేనని ధీమా వ్యక్తం చేశారు. ఎవరినీ భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ శ్రేణులకు తాను పూర్ణ మద్దతుగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రేగూరి విజయపాల్ రెడ్డి, బండి సారంగపాణి, నిప్పాని సత్యనారాయణ, గురిజపల్లి ప్రకాష్ రావు, నేతాని శ్రీనివాస్ రెడ్డి, భీముడి నాగిరెడ్డి, చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, శనిగరం నవీన్, దామెర మొగిలి, గంధె వెంకటేశ్వర్లు, చందుపట్ల తిరుపతిరెడ్డి, అడప రాము, గొర్రెరాజు, జలాలుద్దీన్, నక్క చిరంజీవి, వేణుగోపాల్, పంచగిరి శ్రీనివాస్, దుంపేటి నాగరాజు, గంట కళావతి తదితరులు పాల్గొన్నారు.

# వడ్డించేవాడు.. మనవాడై ఉండాలి




**➲ జన గణనలో కుల గణన తప్పనిసరి**

**➲ బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్**

**వరంగల్ వాయిస్, న్యూ ఢిల్లీ:** "వడ్డించేవాడు మనవాడు అయితే – ఏ మూల కూర్చున్నా మెండుగా ముక్కలు తినవచ్చని" అనే పురాతన సామెత బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎంతగానో వర్తిస్తుతుందని బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో సోమవారం ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కిరణ్ నేతృత్వంలో నిర్వహించిన "ROAD MAP TO BC RESERVATIONS" సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. అశోక్ మాట్లాడుతూ, దేశంలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రతిసారి ప్రయత్నించినా, అగ్రకులాల వర్గాలు కోర్టుల సహాయంతో అడ్డు పుల్ల వేస్తున్నాయని, ఇది ఎంతో విచారకరమన్నారు. న్యాయవ్యవస్థలో బీసీలకు సరైన ప్రాతినిధ్యం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొంది అన్నారు. కొన్ని చోట్ల బీసీలు ఉన్నా, సంఖ్యలో బలంగా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇక్కడికి హాజరైన యువతలో ప్రతి కులం నుంచి ఒక నాయకుడు ఎదిగి, భవిష్యత్ లో పాలన బాధ్యతలు చేపట్టాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అమలులో తమిళనాడు మోడల్‌ను అనుసరించాలన్న డిమాండ్‌ను ఉద్ఘాటిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని అలా నిరూపించుకోవాలన్నారు. ఏ ఉద్యమం లేకుండా అమోదించబడిన ఈడబ్ల్యూఎస్ బిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వం బీసీలపై తీవ్ర అన్యాయం చేసిందని మండిపడ్డారు. ఈ సంక్షోభ సమయంలో బీసీ మేధావులు, సామాజిక కార్యకర్తలు ఎంతో జాగ్రత్తగా, వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సదస్సులో డీఎంకే ఎంపీ విల్సన్ తమిళనాడు మోడల్ పై వివరణ ఇచ్చారు. బీపీ మండల్ మనవడు సూరజ్ మండల్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ఆల్ ఇండియా ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుడు ఆళ్ల రామకృష్ణులు ప్రసంగించారు. అదేవిధంగా జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్ యూ), హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయూ), ఓయూ విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ

**■ లక్షలాది మందితో విజయవంతం చేద్దాం**



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాసంలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయడానికి ప్రధాన కార్యకర్తలతో సమీకరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ – "ఈ సభను ఘనంగా నిర్వహించడం మనందరి బాధ్యత. పార్టీ బలోపేతానికి మనం కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. ఎందుకంటే కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులే మనకు రక్ష. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతున్నారు. ఈ మోసాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపై ఉంది," అని పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, పార్టీ వారికి అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తండాలను గ్రామపంచాయతీగా ప్రకటించిన కేసీఆర్ ఋణం మరచిపోలేనిదని, అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఆ గ్రామాల పట్ల కనీస బాధ్యతను కూడా చూపడం లేదని విమర్శించారు. "ప్రజలు కాంగ్రెసును గెలిపించడం ద్వారా ఒక తప్పు చేశారు–ఇప్పుడు వారికి అర్థమవుతోంది. మనం మళ్లీ వారికి సత్యాన్ని తెలిపి చైతన్యం కలిగించాలి. రైతులకు నష్టమవుతున్న సమయంలో మనం వారి పక్షాన నిలబడాలి," అని దయాకర్ రావు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలం నిరూపించుకోవాలనీ, మళ్లీ మన ప్రభుత్వాన్ని ఏర్పరిచి కేసీఆర్ ను ముఖ్యమంత్రి చేయాలన్న దిశగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో పని చేసిన ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్ మనోజ్ గౌడ్, మండల ఇంచార్జిలు చింతల యాదగిరి, రాజు నాయక్, మాజీ జడ్పీటీసీ లూనార్ పంతులు, నాయకులు చింతపట్ల సోమేశ్వరరావు, చిన్నపాక శ్రీనివాస్, మాడుగుల రాజు, ఏర్పుల శ్రీనివాస్, అమడగాని రాజు, మోహన్ రావు, గంధం బాలరాజు, జనార్దన్ రెడ్డి, మాధవరావు, బండి సంతోష్ మహేష్, దేవేందర్, సురా అశోక్ (మాజీ ఎంపీటీసీలు), మాజీ సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, మండల యూత్ అధ్యక్షుడు బూర శ్యామ్, బీసీ సెల్ అధ్యక్షుడు జడల కృష్ణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జీడి గట్టయ్య, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు బరిగెల విజయ, సోషల్ మీడియా కన్వీనర్ బోట్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రీడాకారుడు ప్రశాంత్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** కంబోడియాలో జరిగిన తొలి ఆసియా పారా త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో 8 దేశాలు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ఇండియా తరఫున ప్రాతినిధ్యం వహించిన రాయపర్తి మండలం గాడిపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ అద్భుత ప్రదర్శనతో బ్రాంజ్ మెడల్‌ను సాధించి, దేశానికి గౌరవాన్ని తీసుకొచ్చాడు. భారత జట్టు తృతీయ స్థానంలో నిలవడంలో ప్రశాంత్ కీలక పాత్ర పోషించాడు. ఈ విజయాన్ని పురస్కరించుకొని సోమవారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేతకుల రంగారెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, రాష్ట్ర ఎస్టీ సెల్ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులు గజావెల్లి ప్రసాద్, ఎండీ యూసఫ్, కోలా సంపత్, ఎల్లస్వామి, గాడిపెల్లి రాములు, చిర్ర దర్గయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రి ఆకస్మిక తనిఖీ



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ విభాగాలు, రికార్డులు, సిబ్బంది హాజరు పట్టిక (బయోమెట్రిక్ అటెండెన్స్)లను పరిశీలించారు. సమయ పాలన పాటించకపోయిన వైద్యులు, సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు నిర్దిష్ట సమయంలో అందుబాటులో ఉండి, ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలనే సూచనలిచ్చారు. నిబంధనలు పాటించని వైద్యులు, సిబ్బందిని ఉపేక్షబోమని, అవసరమైతే విధుల నుంచి తొలగించడానికీ వెనుకాడబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు.

# ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని వరంగల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దేశాయిపేటలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డీఎం అండ్ హెచ్ఓ మాట్లాడుతూ, 2025 సంవత్సర థీమ్ – "ఆరోగ్యకర ఆరంభాలు... ఆశాజనక భవితవ్యాలు" నినాదంతో ప్రపంచమంతా మానవాళి ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించి, తల్లి–శిశు ఆరోగ్యాన్ని కాపాడేందుకు నైతికంగా వ్యవహరించాలన్నారు. మాతృమరణాలు, శిశు మరణాలు తగ్గేలా చర్యలు తీసుకోవాలని, అలాగే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య చక్రంపై అవగాహన పెంపొందించాలన్నారు. సామాజిక–ఆర్థిక అభివృద్ధికి అవగాహన పెంపొందించడం, సమానత్వం, సమన్యాయం, అందరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం మనందరి కర్తవ్యమని పేర్కొన్నారు. భావితరాలకు ఆరోగ్య భద్రత కల్పించడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఐ.ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఆచార్య, డాక్టర్ విజయకుమార్, దేశాయిపేట ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ భారత్ కుమార్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సీఓ కోర్నేలు, ఎల్డీ కంప్యూటర్ నాగరాజు మరియు ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీ రాష్ట్ర పథకమే



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** భారతదేశంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వం మాత్రమే పేదలకు సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఇది సామాన్య ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకున్న చొరవగా నిలిచింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ విధంగా పంపిణీ చేస్తే, అది దేశవ్యాప్తంగా అమలవ్వాలి. కానీ కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రోజు కూడా సన్న బియ్యం పంపిణీ చేయలేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, వారి కడుపు నింపేందుకు సన్న బియ్యం పంపిణీ చేయాలని తీసుకున్న నిర్ణయం ప్రజల మద్దతును సంపాదించిందన్నారు. ఈ ఆదరణను చూసి ఓర్వలేక కొందరు బీజేపీ నాయకులు "ఇది కేంద్ర ప్రభుత్వం చేస్తున్నదే" అంటూ ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. నిజంగా కేంద్రం ఇస్తే, దేశమంతటా అమలు చేయాలి కదా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం కేంద్రానికి రూ.1 రూపాయికి 40 పైసలు జీఎస్టీ రూపంలో చెల్లిస్తోంది. ఆ డబ్బుతో దేశవ్యాప్తంగా ఖర్చు చేస్తే, తెలంగాణ వాటా ఉందని ఎందుకు చెప్పడం లేదు? తెలంగాణకు రావలసిన నిధులను ఎందుకు నిలిపేస్తున్నారు? విభజన హామీలను ఎందుకు అమలు చేయడం లేదు? ప్రాజెక్టులకు జాతీయ హోదా ఎందుకు ఇవ్వడం లేదు? స్పెషల్ స్టేటస్ ఎందుకు నిరాకరిస్తున్నారు? బడ్జెట్‌లో ప్రత్యేక కేటాయింపులు ఎందుకు ఉండవు? అన్నారు. ప్రతి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని చెప్పిన మాటలకు అమలు ఎందుకు లేదు? ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ ఎందుకు చేస్తున్నారు? మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సెల్ నాయకులు, యువత కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంఘటిత, అసంఘటిత కార్మికులపై నిర్లక్ష్యం తగదు



**వరంగల్ వాయిస్, పరకాల :** భవన నిర్మాణ కార్మికులకు కార్డులు పొందిన ప్రతి ఒక్కరికి లేబర్ శాఖ అధికారులు స్వయంగా విచారణ నిర్వహించి, లబ్దిని అందజేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ సీనియర్ నాయకులు అడగాని జనార్దన్ రావు కోరారు. ఇటీవల బోకర్లు లేబర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ కార్మికుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి. కార్మికులు నేరుగా లేబర్ ఆఫీసుని సంప్రదించి తమ వివరాలు సమర్పించినపుడే అసలైన లబ్ధిదారులకు హక్కులు అందుతాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో, ముఖ్యంగా జిల్లా లేబర్ ఆఫీసులో జరుగుతున్న అక్రమ వ్యవహారాలను అధికారులు కనుగొనలేకపోతుండటం, లేదా నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. శ్రమజీవుల భావాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. చాలా షాపు యజమానులు లేబర్ లైసెన్స్ పొందకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున, వారిపై కఠిన చర్యలు తీసుకుని లైసెన్స్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలి. లైసెన్స్ లేకపోవడం వల్ల ఆ షాపుల్లో పనిచేసే కార్మికులు కార్మిక సంక్షేమ బోర్డు నుంచి వచ్చే ప్రయోజనాలను కోల్పోతున్నారు. అంతేకాక, వారానికి ఒకరోజు విశ్రాంతి ఇవ్వాల్సిన నిబంధన కూడా చాలాచోట్ల పాటించడంలేదు. కార్మికులపై శారీరకంగా, మానసికంగా శ్రమపెట్టే పరిస్థితులు నెలకొన్నాయి. విభిన్న రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే ఇల్లు లేని కార్మికులకు నివాసాలు కల్పించాలని వారు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జాగ్రత్తపడి, కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## సీఎంకు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ఉద్యోగుల లేఖలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత ఇరవై ఏళ్లుగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం సీఎం కార్యాలయానికి వినతిపత్రాలు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపినట్లు తెలిపారు. ప్రతి వార్షికంగా ఇచ్చే అగ్రిమెంట్ బాండ్ పేపర్‌లో తెలంగాణ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ చేసిన మార్పుల కారణంగా తమ సీనియారిటీ దెబ్బతిన్నదని, ముందుగా ఎలాంటి సమాచారం లేకుండానే తమ నుంచి ఒక్క రోజు జీతాన్ని కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో సీఎంకు లేఖలు రాసినట్లు ఉద్యోగులు వెల్లడించారు.

## అంబేద్కర్ రాజ్యాంగాన్ని ప్రజలకు వివరించాలి

▪ ఎమ్మెల్యే డా. రాంచందర్ నాయక్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** జై బాపు –జై భీం–జై రాజ్యాంగం నినాదంతో నిర్వహిస్తున్న రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో భాగంగా డోర్నకల్ మండలం ముల్కలపల్లి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. రాంచందర్ నాయక్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజ్యాంగంపై ప్రజల్లో అవగాహన పెంచడమే ఈ యాత్ర లక్ష్యమన్నారు. ఇటీవల రాజ్యసభలో జరిగిన చర్చలో హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అంబేద్కర్‌కు అవమానకరమని విమర్శించారు. "అంబేద్కర్ అనే పేరు పదే పదే ప్రస్తావించడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ఆ పేరు ఎక్కువగా చెప్పినంత మాత్రాన ఎవరికీ స్వర్గంలో స్థానం లభించదు" అనే వ్యాఖ్యలు దుర్వాక్యమన్నారు. అంబేద్కర్, గాంధీ, పూలే వంటి మహానుభావుల ఆలోచనలతో రూపొందిన రాజ్యాంగం ఒక పవిత్ర గ్రంథమని, బీజేపీ పార్టీలో కొందరు దాన్ని తక్కువ చేస్తూ మాట్లాడడాన్ని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు బడాబాబులకు మద్దతు పలుకుతూ, పేదల ఆశయాలను మరిచిపోయిన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను ప్రాధాన్యంగా తీసుకుని, ఆరు గ్యారంటీలను అమలు చేస్తోందని, బీఆర్ఎస్ హయాంలో అమలైన పథకాలను కొనసాగిస్తోందన్నారు. బీఆర్ఎస్ నాయకులు మాత్రం ఈ అభివృద్ధిని ఓర్చుకోలేక సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే సంబంధిత అధికారులతో, మంత్రులతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జగదీష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్ యాదవ్, మండల కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### కురవిలో..

కురవి మండలం సిరోలు, వస్రం తండా, ఉక్కుల తండా, తాళ్ల సంకిసా గ్రామాల్లో డా. రాంచందర్ నాయక్ పర్యటించారు. అంబేద్కర్ ఆశయాలు, విధివిధానాలను ప్రజలకు వివరించారు. రాజ్యాంగం గొప్పతనాన్ని వివరించి, ప్రజలకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో సిరోలు మండల అధ్యక్షులు కరుణాకర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ నాయక్, అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు కామ సంజీవరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు రాము నాయక్, యూత్ నాయకులు నాగేశ్వరరావు, సురేష్ నాయక్, మల్లికంటి సురేష్, మహేందర్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు కార్యకర్తలు తరలి రావాలి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్:** ఈ నెల 27వ తేదీన హనుమకొండ జిల్లా ఎలుకతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభలకు 40వ డివిజన్ నుంచి ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లేందుకు నాయకులు చొరవ చూపాలని కార్పొరేటర్ మరుపల్లి రవి కోరారు. సోమవారం ఉర్సు ప్రతాప్ నగర్‌లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ మరుపల్లి రవి హాజరై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వ్యాఖ్యానించారు. సంక్షేమ పథకాలపై ఆశలు పెట్టుకున్న ప్రజలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తరువాత తూర్పు నియోజకవర్గంలో కొంతమంది నాయకులు ఇతర పార్టీలకు వెళ్లినప్పటికీ, ఇప్పుడు తిరిగి రావడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. డివిజన్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరుతూ, వాటిని ప్రజాప్రతినిధుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పూజారి విజయ్, కార్యదర్శి వనం కుమార్, బూత్ కన్వీనర్లు మరుపల్లి గౌతం, శెట్టి మోహన్, పోలెపాక రాజన్ బాబు, సాదుల రంజిత్, కళ్యానపు వెంకటేశ్వర్లు, పోలెపాక మల్లేశం, తౌతం నరసింహ, గడ్డం రమేష్, మంద నవీన్, వేల్పుగొండ నర్సింహం, కొలుపుల చంద్రకళ, ఎండి వహీదా, గుల్లపెల్లి కర్ణ, పుట్టబత్తుల స్రవంతి, నామాల రాజు, బండారి సదానందం, భౌరిశెట్టి సదానందం తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన ఏఎంసీ చైర్ పర్సన్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి–రవీందర్ కలిసి మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై వినతి పత్రం సమర్పించారు. అలాగే మండల కేంద్రంలో జరుగుతున్న కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల దురాక్రమణ, గుండేడు, పంగిడిపల్లి గ్రామాలలో అక్రమ మైనింగ్ దందా, మండలంలోని పలు వాగుల నుంచి అక్రమ ఇసుక రవాణా తదితర అంశాలను జిల్లా కలెక్టర్ కు వివరించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కమలాపూర్ మండలంలో 450 డబుల్ బెడ్ రూమ్ గృహముల పెండింగ్ పనిని త్వరితగతిన పూర్తి చేయించి అర్హులైన లబ్ధిదారులకు అందించాలన్నారు.


## సన్న బియ్యం పంపిణీ ప్రారంభం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** డివిజన్ లో ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని 40 వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లరవి ప్రారంభించారు. ప్రభుత్వ చౌకధరల దుకాణారులైన బైరి నాగమణి తుమ్మ లక్ష్మణ్, ఎనబోతుల లావణ్య, రాంపల్లి రాహుల్, టి.జీవన్, మోర రూప, మాటేటి నీరజ, పోరండ్ల అరుణ డిపోలలో లబ్ధిదారులకు కార్పొరేటర్ మరుపల్ల రవి అందజేశారు.

# సంఘటితంగా అభివృద్ధి

- ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ సుధారాణి
- చింతగట్టులో పద్మశాలి భవనానికి శంకుస్థాపన
- వారి అభ్యున్నతికి కృషి చేస్తామంటూ హామీ



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** పద్మశాలీలు సంఘటితంగా అభివృద్ధి చెందాలని, అందుకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని నగర మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హామీ ఇచ్చారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని చింతగట్టు క్యాంప్ సమీపంలోని పద్మశాలి సంఘ భవానికి రూ.1 కోటి సాధారణ నిధులతో నిర్మించనున్న భవనానికి సోమవారం వారు శంఖుస్థాపన చేశారు. తొలుత పద్మశాలి సంఘం పెద్దలు, సభ్యులు సుధారాణి, నాగరాజులకు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం 10 ఫిబ్రవరి, 2021లో హనుమకొండ జిల్లా, హసన్ పర్తి మండలం చింతగట్ల–బీమారం గ్రామంలోని సర్వే నెంబర్ 146/2లో 34గుంటలు, సర్వే నెంబర్ 155/1లో 1.06 ఎకరాలు మొత్తం రెండు ఎకరాల భూమిన పద్మశాలి కమ్యూనిటీ హాల్ కు కేటాయించింది. ఈ మేరకు అప్పటి ప్రిన్సిపల్ కార్యదర్శి డాక్టర్ రజత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటి సీఎం కేసీఆర్, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ల సహకారంతో ఇరిగేషన్ అండ్ కాడ్ డిపార్ట్ మెంట్ కు చెందిన భూమిని పద్మశాలి కులస్థులకు కేటాయించేందుకు మేయర్ గుండు సుధారాణి విశేష కృషి చేశారు. జీడబ్ల్యూఎంసీ నుంచి భవన నిర్మాణానికి రూ.1కోటి నిధులను కూడా మేయర్ కేటాయించి తన ఔదార్యాన్ని చాటారు.

వారి కృషి మరువలేనిది..

పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం చితగట్టు ప్రాంతంలో ప్రభుత్వం కేటాయించిన రెండు ఎకరాల భూమిని కాపాడడంలో మేయర్ గుండు సుధారాణి–ప్రభాకర్ దంపతుల కృషి మరువలేనిదని పలువురు కొనియాడారు. భవిష్యత్ తరాలకోసం వారు దీనిని రక్షించారన్నారు. పుట్టి పెరిగిన కులానికిసేవ చేసి తమ ఉదాత్త సేవను చూపారన్నారు. కొందరు స్వార్థపూరిత రాజకీయాలు చేస్తూ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న విషయాన్ని పసిగట్టి యుద్ధ ప్రాతిపదికన చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారన్నారు. పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదైతే వారి పలుకుబడితో క్లోజ్ చేయించారన్నారు. ప్రధాన రహదారి ముందు బల్దియా నిధులతో కాలువ కట్టించి గేట్ ఏర్పాటు చేయడంలో సుధారాణి–ప్రభాకర్ ఎంతో కృషి చేశారన్నారు.

స్థానిక కార్పొరేటర్ వరుణగంటి అరుణ కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పద్మవాలి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యవేక్షకులు వద్నాల నరేందర్, కమలాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ–రవీందర్, పూర్వ స్పీకర్ ఓఎస్డీ గడ్డం భాస్కర్, ఆడెపు రవీందర్, జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, వేముల నాగరాజు, వేముల సదానందం, పులికంటి రాజేందర్, కనుకుంట్ల సతీష్, బండా వివేకానంద, హనుమకొండ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, గోరంటల రాజు, కుసుమ సతీష్, గుండు చందన పూర్ణచందర్, మాటేటి అశోక్, బైరి శ్యాంసుందర్, బండ కాళిదాస్, మేర్గు సత్తయ్య, పేరాల కనుకయ్య, మండల శంకరయ్య, మామిడాల సత్తయ్య, డాక్టర్ మామిడాల ప్రకాశ్ రావు, గుండు కామేశ్వర్, గోశికొండ సుధాకర్, గైని సత్యనారాయణ, దుబాసి చక్రపాణి, బొప్ప శివశంకర్, కిరణ్, దేవరకొండ అనిల్, శ్రీరామ్, పద్మశాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



















# పంచాయతీ కార్యదర్శుల బదిలీలు ఆపండి

- ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి
- టీఎన్జీఓస్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్
- గ్రీవెన్స్ లో కలెక్టర్ కు వినతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పంచాయతీ కార్యదర్శుల బదిలీల నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని కోరుతూ సోమవారం హనుమకొండ జిల్లా టీఎన్జీఓస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు అధిక సంఖ్యలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యను కలెక్టరేట్ కార్యాలయంలోని గ్రీవెన్స్ లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయాలని చూడడం సరి కాదని పేర్కొన్నారు. ఎనిమిది నెలల క్రితమే సాధారణ బదిలీల్లో భాగంగా పెద్ద సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయడం జరిగిందని తిరిగి మరల బదిలీలు చేయడం వల్ల కార్యదర్శులు అనేక ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. పాలకవర్గం ముగిసి ఏడాది గడిచినా పంచాయతీ ఎన్నికలు కాకపోవడంతో పలు ప్రాంతాల్లో గ్రామాల అభివృద్ధి పనులకు ఆయా గ్రామాల కార్యదర్శులు పెద్ద మొత్తంలో సొంత డబ్బులు ఖర్చు పెట్టడం జరిగిందని గుర్తు చేశారు. వారిని బదిలీ చేస్తే వారు ఖర్చుపెట్టిన సొమ్ము తిరిగి అందడం కష్టమవుతుందన్నారు. అట్టి డబ్బును వెంటనే ప్రభుత్వం నుంచి ఇప్పించాల్సిందిగా కలెక్టర్ ను కోరారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీలను టీఎన్జీఓస్ యూనియన్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం అని పేర్కొన్నారు. ఇట్టి విషయాన్ని టీఎన్జీఓస్ కేంద్ర సంఘం అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ ల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెల్లి బదిలీల నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా చూస్తామన్నారు. ఇట్టి విషయంలో జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినారని, కార్యదర్శుల విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షులు శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం కార్యదర్శి ఇంజపల్లి నరేష్, కార్యవర్గం, పంచాయతీ కార్యదర్శులు ఎండి రఫీ, వెంకన్న, సురేష్, కృష్ణంరాజు, సౌజన్య, అంజలి, వెంకటేశం, ఉమకేశ్వర్, యాదగిరి, ప్రవల్లిక, లావణ్య, యాక లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజావాణి వినతుల త్వరగా పరిష్కరించాలి..**

వివిధ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ లో ప్రజలు అందించిన వినతులను వెంటనే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యలపై వినతులతో వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను విన్నవిస్తూ 106 వినతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, జిల్లా అధికారులతో పాటు పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.



# సరస్వతీ పుష్కరాలకు ఏర్పాట్లు ముమ్మరం

**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యటించారు. మే నెలలో నిర్వహించనున్న సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. వీఐపీ ఘాట్ వద్ద జరుగుతున్న ర్యాంప్, సరస్వతి దేవి విగ్రహ ఏర్పాటు పనులను తనిఖీ చేశారు. శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న మరుగు దొడ్లతోపాటు ప్రధాన ఘాట్ ల వద్ద జరుగుతున్న మరుగుదొడ్ల పనులను అధికారులతో ఆయన పరిశీలించారు. విద్యుత్ స్థంబాల ఏర్పాటు, పుష్కర ఘాట్లలో స్నానఘట్టాలు, ఆర్ డబ్ల్యు ఎస్ ద్వారా నిర్మిస్తున్న మంచినీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఈఓ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే నెలలో కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. కొన్ని చోట్ల శాశ్వత ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టామన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మరుగు దొడ్లు, తాగు నీరు, పుష్కర ఘాట్లలో స్నానఘట్టాలు, బట్టలు మార్చుకునే గదులు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. మే 4వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పక పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, డీపీఓ నారాయణ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇరిగేషన్ అధికారులు, దేవస్థానం ఈఓ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మ పరిరక్షణే హిందూ సేవా సమితి లక్ష్యం

- హిందు సేవ సమితి అధ్యక్షుడు నాగపురి వెంకటేష్ గౌడ్
- కాషాయ మయమైన ఓరుగల్లు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** శ్రీరామనవమిని పురస్కరించుకొని హిందూ సేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఓరుగల్లు నగరంలో హిందూ విజయ యాత్ర పేరిట భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కాజీపేట కడిపికొండ బ్రిడ్జి వద్ద ప్రారంభమైన ర్యాలీ అర్ధరాత్రి వరంగల్ లోని దుర్గేశ్వరాలయంలో ముగిసింది. ఈ సందర్భంగా హిందు సేవ సమితి అధ్యక్షులు నాగపురి వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ శ్రీరాముని జీవితమే మానవాళికి ఆదర్శం అన్నారు. శ్రీరాముని మందిరమే స్వాభిమాన సంకేతం అన్నారు. ఇలాంటి శోభాయాత్రల వల్ల హిందువుల్లో చైతన్యం, ఐక్యతను, శక్తిని, భక్తిని చాటడానికి ఉపయోగపడతాయన్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన హిందూ బంధువులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో చేపట్టే ప్రతి కార్యక్రమంలో ఇంతకన్నా రెట్టింపు ఉత్సాహంతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీకృష్ణ చరణానంద స్వామి జి మాట్లాడుతూ హిందూ మతం కాదు ఇది ఒక జీవన విధానం అని అన్నారు. ప్రపంచంలో ఎన్ని నదులు పుట్టినా చివరకు కలవాల్సింది సముద్రంలోనే. అలాగే ప్రపంచంలో ఎన్ని మతాలు పుట్టినా చివరకు కలవాల్సింది హిందూ ధర్మంలోనే అని అన్నారు. మరో ముఖ్య అతిథి డాక్టర్ తరుణ్ రెడ్డి మాట్లాడుతూ శ్రీరాముడు సకల గుణాభిరాముడు. అతని జీవితం భారతీయ ప్రజలకు ఆదర్శప్రాయం అన్నారు. ఈ కార్యక్రమంలో రఘువీర్ రెడ్డి, భూపాల్, రానా యాదవ్, నవీన్, రవి, సాగర్, వెంకట్, నిఖిల్, వెంకట్రావు, నవీన్, గోగికర్ క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్ వాయిస్, వరంగల్ :** యాసంగి ధాన్యం కొనుగోలు కోసం అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలసి సహకార శాఖ, ఐకేపీ, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2024-25 సంవత్సరానికి సుమారు 182 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 1.90లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం, 30 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం.. మొత్తం 2.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. 107 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సహకార శాఖ ఆధ్వర్యంలో, 60 కొనుగోలు కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యంలో, 2 మెప్మా కొనుగోలు కేంద్రాలు, 13 కొనుగోలు కేంద్రాలు ఎఫ్ పీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ కౌసల్య దేవి, డీసీఎస్ఓ కిష్టయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సంధ్యారాణి, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మారెటింగ్ అధికారి సురేఖ, జిల్లా సహకార అధికారి నీరజ, మెప్మా డీఎంసీ రేణుక తదితరులు పాల్గొన్నారు.

**మన ఊరు మనబడిపై సమీక్ష**

జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం 'మన ఊరు మనబడి – మన బస్తీ మన బడి' పథకం కింద మంజూరు అయినా పనులు పెండింగ్ సమస్యలపై సంబంధిత ఇంజనీర్ శాఖల అధికారులు, ఎంఈవోలతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీఆర్ఓ విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ పాల్గొని ఎంఓ ఎంబీ పనుల పెండెన్సీపై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన ఊరు మనబడి కింద మంజూరు అయిన పనుల వివరాలు, అడ్మినిస్ట్రేషన్ మంజూరు, పూర్తి వివరాలతో ఎంబీలు సమర్పించవలసిందుగా ఎంఈఓలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఇ ఈ.ఇజ్జగిరి, ఆర్ అండ్ బి ఈఈ, సంబంధిత శాఖల అధికారులు, స్కూల్ హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com